# ఆమని పిలిచింది

(నవల)



పి. ఎస్. నారాయణ

# ఆమని పిలిచింది

పి. ఎస్. నారాయణ

---

## నవల

AAMANI PILICHINDI (NOVEL)

**ఆమని పిలిచింది**

**పి.ఎస్.నారాయణ**

హక్కులు : రచయితవి

ప్రథమ ముద్రణ : డిశెంబరు, 2011

పుస్తకాలంకరణ : **జాగృతి గ్రాఫిక్స్**
3-4-228/4/1, జాగృతి భవనం,
కాచిగూడా, హైదరాబాద్-27,
ఫోన్:27562625

ముద్రణ: **ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
1-1-191, చిక్కడపల్లి, హైదరాబాద్,
ఫోన్: 27664525

ప్రతులకు: **పి.ఎస్.నారాయణ,**
8-3-168/20/బి/7, సిద్ధార్థనగర్ (నార్త్),
హైదరాబాద్- 500 038.
ఫోన్: 23713835, 99483 19407

**సాహిత్యనికేతన్,**
3-4-852, బర్కత్‌పురా, హైదరాబాద్- 27.

**విశాలాంధ్ర బుక్ హౌస్,**
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.

**నవోదయా బుక్ హౌస్,**
కాచిగూడ, హైదరాబాద్-500 027

వెల: రూ. 80/-

# అంకితం



నా ప్రతి రచనకు మొదటి పాఠకురాలయిన

నా **శ్రీమతి మాధురీ అన్నపూర్ణకు**

ఆత్మీయంగా...

**పి.ఎస్.నారాయణ**

# నాలుగు మాటలు

కథానికకు కాని నవలకు కాని వస్తువు (ప్లాట్) ప్రధానం. వస్తువును రచయిత తన ప్రతిభతో నడిపిస్తాడు. చక్కటి వస్తూన్మీలన (డెవలప్‌మెంట్) కు సంఘర్షణ అవసరం. భిన్న దృక్పథాలుకల పాత్రలను సృష్టించి వాటి మధ్య ఏర్పడే సంఘర్షణ ఆధారంగా రచయిత పాఠకులకు పరోక్షంగా ఒక సందేశాన్ని అందజేస్తాడు. నవలలో నాటకీయతకూడా అవసరమే. పి.ఎస్.నారాయణగారు అనేక రచనలు చేసిన అనుభవజ్ఞుడు. అందువలన సహజంగానే చక్కటి కథావస్తువు నెంచుకున్నారు. తదనుగుణమైన పాత్రలకు రపాన్నిచ్చి వాటి వికాసాన్ని మరచిపోకుండా తీర్చిదిద్దారు.

'ఆమని పిలిచింది' నవలలో ప్రధానపాత్ర సులోచనదే. ఆ పాత్ర ద్వారా రచయిత గ్రామీణ వికాసానికి మార్గాన్ని సూచించారు. గ్రామీణ వికాసం ద్వారా దేశాభ్యుదయం సాధించవచ్చునీ, అందుకు స్త్రీలు– ముఖంగా చదువుకున్న స్త్రీలు బాధ్యత స్వీకరించాలనీ ఆయన చెప్పదలుచుకున్నారు. అలాగే కుటుంబంలో ప్రేమాభిమానాలు, సేవాభావం దానికితోడు కొంత నిస్వార్థం ఉంటేనే ఆ కుటుంబం నిలదొక్కుకుంటుంది. దారితప్పుతున్న సంపత్‌కు తగు రీతిలో ఈ విషయాలను అర్థమయ్యేటట్లు చేసింది సులోచన. పెద్దలపట్ల గౌరవం కూడా రానురాను తగ్గుతోందనీ, దానినీ పునరుద్ధరించాలని సంపత్‌కు సులోచన తెలియ చెప్పింది.

ధనార్జన అవసరమే కాని తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేస్తూ ధనాన్ని సంపాదించవలసిన పనిలేదు. గ్రామాలు మరీ మంచితనంతో నిండి లేవని, అక్కడ కూడా రాఘవలాంటి స్వార్థపరులుంటారనీ పి.ఎస్.నారాయణగారు సూచించారు.

వస్తూన్మీలనలో భాగంగా పెద్దగా మలుపులూ, ఉత్కంఠభరిత సన్నివేశాలూ లేకపోయినా పాఠకులను ఏకబిగిన చదివించే నవల, ఆమని పిలిచింది. నడక సుందరమైె భాష ఈ నవల ప్రత్యేకత. పి.ఎస్.నారాయణ మరిన్ని నవలలను తెలుగు పాఠకులకు అందించాలని కోరుకుంటున్నాను. వారికి నా అభినందనలు.

**తుమ్మలపల్లి హరిహర శర్మ**

సంపాదకుడు

'శ్రీ శంకర కృప' మాస పత్రిక

# నామాట...

నాకు పదిసంవత్సరాల వయస్సు వచ్చేటంతవరకూ– అంటే 1947వ సంవత్సరం దాకా మా స్వగ్రామమైన మంగళగిరి పక్కన చినకాకానిలో పెరిగాను. అక్కడే అయిదో తరగతి వరకూ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాను. తరువాత పదహారు సంవత్సరాలు గుంటూరులో వుండి, నలభై ఎనిమిది సంవత్సరాలుగా హైదరాబాదులో వుంటూ ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నాను. ఇది ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే నేను గ్రామంలో వున్నది నాకు ఊహ తెలిసీ తెలియని వయస్సులో కొద్దికాలమే అయినా అప్పటి అక్కడి వాతావరణం ముఖ్యంగా సంక్రాంతి, దసరా, దీపావళి పండగలప్పుడు కళకళలాడుతూ కనబడిన ఆ దృశ్యాలను గుర్తుకు తెచ్చుకుంటుంటే తెరమీద గీసిన అందమైన బొమ్మల్లాగానే కనబడుతుంటయి. పచ్చని పొలాలు. చెట్లు. చాలా ఇళ్ళకు ఆ ఆవరణలోనే ముందు ఒక పక్కగా తాటాకుల సావిడి... అందులో బర్రెగొడ్లు... ఓ పక్కన బావి, దాని చుట్టూ పళ్ళెం... అక్కడనుంచి జారి క్రిందకు నీళ్ళు వెళ్ళేచోట అరటి చెట్లు... ఓ పక్కగా కూరల మొక్కలు... సామాన్యంగా పల్లెలో ప్రతి గృహంలోనూ ఉండే దృశ్యం అదే... నాకయితే కూరలుగాని, పాలూ, పెరుగు గాని ఎన్నడూ కొనుక్కున్న గుర్తులేదు. ఇక వాకిట్లోకి వస్తే ప్రతి ఇంటికీ ఓ అరుగు... సాయంత్రం అయ్యేటప్పటికి దానిమీద తెలిసిన వాళ్ళు వచ్చి కూర్చొని కబుర్లు చెప్పుకోవటం...

మా ఇంటికి మా మేనమామగారింటికి మధ్య మరో ఇల్లు... నేనెక్కువగా వాళ్ళింట్లోనే గడుపుతుండేవాడిని... ఆడపిల్లలుకాక, నాకంటే పెద్దవాడయిన బావగారు, నా వయస్సు వాడు, నాకంటే చిన్నవాడు అయిన ముగ్గురు మగపిల్లలు మా మామయ్యగారికి. నా వయస్సువాడితో ఎక్కువగా ఆడుతుండేవాడిని. చిన్నవాడు కూడా మాతో కలుస్తుండేవాడు. ఆ చిన్నవాడే తెలుగు పాఠకులందరికీ పరిచయమయిన ప్రముఖ రచయిత డా॥కాకాని చక్రపాణి.

నాకు గుర్తున్నంతవరకూ పల్లెల్లో వేరువేరు కులాల వాళ్ళయినా బంధువుల్లా వరసలుకట్టి బాబాయ్, మామయ్యా అంటూ పిలుచుకుంటుంటారు. లీలగా వున్న ఈ

జ్ఞాపకాలను ప్రధానంగా చేసుకొని గ్రామీణ వాతావరణంలో నవల రాయాలనిపించి, **ఆమని పిలిచింది** వ్రాశాను. ఇప్పటికీ గ్రామాలతో అనుబంధం ఉంచుకొని గ్రామీణ వాతావరణంలో కథలూ, నవలలూ వ్రాస్తున్న ప్రముఖ రచయిత శ్రీ అలపర్తి రామకృష్ణగారు ఈ నవల రాస్తున్నప్పుడు, ఆయన మాటలతో నన్ను గ్రామాల్లోకి తీసుకువెళ్ళి ఆ వాతావరణాన్ని కళ్ళముందు చూపించారు. వారితో స్నేహం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తుంది.

ఏదైనా నవల జాగృతికి ఇవ్వండి అని డా॥వడ్డి విజయసారథిగారు అన్నప్పుడు గ్రామీణ వాతావరణంలో ఓ నవల రాస్తున్నాను– మీకు అంగీకారమయితే పూర్తవ్వగానే ఇస్తాను అని చెప్పాను. అలాగే ఇవ్వండి అన్నారు. వారికి నేనన్నా, నా రచనలన్నా ఎంతో అభిమానం. **ఆమని పిలిచింది** వ్రాసి ఇవ్వగానే అది వారికి నచ్చగా, జాగృతిలో వెంటనే ప్రచురణ ప్రారంభించారు. అంతేగాకుండా తరువాత దీన్ని పుస్తకరూపంలో తీసుకురావటంలో వారి ప్రోద్బలమూ, సహకారమూ ఎంతగానో వున్నయి. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

శ్రీ తుమ్మలపల్లి హరిహరశర్మగారు 'శ్రీ శంకర కృప' మాసపత్రిక సంపాదకులు. పండితులు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరైన తర్వాత కూడా విద్యారంగానికి ఎంతో సేవచేస్తున్నవారు. వారు నా ఈ నవలకు ముందుమాట వ్రాయటం ఎంతో ఆనందంగా వున్నది. నా నవలకు వారి 'నాలుగు మాటల'తో విలువ పెరిగినట్లుగా భావిస్తున్నాను. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన జాగృతి గ్రాఫిక్స్‌వారికి, ముద్రించిన ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి నా కృతజ్ఞతలు.

12.11.2011 – పి.ఎస్.నారాయణ

హైదరాబాద్

# ఆమని పిలిచింది

**"నేను నాలుగు రోజులు ముందు వెళతాను... ఎవరో దూరపు బంధువుల్లా ఆరోజు ఉదయాన వెళితే ఏం బాగుంటుంది?" అన్నది సులోచన భర్తవంకే చూస్తూ.**

**అప్పుడు రాత్రి పదకొండుగంటలైంది. అంతకు గంట క్రితమే వాళ్ళు నర్సింగ్‌హోం నుంచి ఇంటికివచ్చి భోజనాలుచేసి బెడ్‌రూంలోకి వెళ్ళారు. వాళ్ళిద్దరూ డాక్టర్లు!**

**"నిజమేనమ్మా! బాగుండదు... ఇక్కడ సంగతి ఎవరు చూస్తారు... నా ఒక్కడివల్లా అవుతుందా ఇన్‌పేషెంట్లనూ, ఔట్‌పేషెంట్లనూ చూడటం?"**

"ఎలాగో అలాగూ తిప్పలు పడాలి... ఫంక్షనయిన మర్నాడు మీరు ఉండమన్నా నేను ఉండను. మీతోపాటే వచ్చేస్తాను. బుధవారం రాత్రి మీరు భోజనంచేసి కారులో బయల్దేరండి... వస్తే అమ్మా నాన్నా కూడా మీతో వస్తారు... ఆరోజంతా అక్కడవుండి ఫంక్షన్ పూర్తవ్వగానే మరునాడు ఉదయాననే తిరిగి బయల్దేరదాం... నేను వెళ్ళేటప్పుడు ట్రైన్‌లో వెళతాను... రేపు ఆసుపత్రికి వెళ్ళేముందే ఇంటర్నెట్‌లో టిక్కెట్టు తీసుకుందాం!"

సంపత్ మాట్లాడలేదు. తదేకంగా భార్యవంకే చూస్తున్నాడు.

"స్వామీ! ప్రతిదానికీ దిగులుపడితే ఎలా... మీ ఖాస్‌దోస్త్ కావేరి ఉన్నదిగా... నేను లేని ఆ నాలుగురోజులూ ... ఆపైన ఏవైనా అర్జంటు కేసులూ వస్తే వచ్చి చూచి వెళ్ళమనండి... సమస్య ఏముంటుంది?"

"ఆమె ఉద్యోగం ఎగగొట్టి రావాలిగదా?"

"ఏంటీ... ప్రతిదానికీ ఏదో ఒక మెలిక వేస్తారు? అంతమంది డాక్టరు స్నేహితులున్నారు మీకు... వాళ్ళ నర్సింగ్ హోంలకు అవసరమొస్తే మీరు వెళ్ళటంలేదా... మరీ అంత మొహమాటపడితే ఎలా... మనంమాత్రం ఎప్పుడూ అడుగుతున్నామా... ఎప్పుడో ఇట్లాంటి అవసరం వస్తే తప్ప!" కాస్త కంఠం హెచ్చించింది సులోచన.

కన్నార్పకుండా భార్యనే చూస్తున్నాడు సంపత్. ఆమె ముందుగా వెళ్ళి చేసేదేముంటుంది అక్కడ?

సంపత్ మాట్లాడలేదు– నాలుగు రోజులంటే ఆసుపత్రిలో ఇబ్బందే!

మామగారి షష్టిపూర్తి. ఆ వేడుకను చాలా పెద్దఎత్తున చేసుకోవాలని ఆయనదే కాదు, ఆ ఊరివారందరీ కోరిక. ఆయన ఉండేది గుంటూరుజిల్లాలో పొన్నూరుకు అయిదు కిలో మీటర్ల దూరంలోవున్న సాయీరామపురం. అది వాళ్ళ తాతలకాలంలో ఆ కుటుంబ సభ్యులతోనే ప్రారంభమయిన ఊరు.

సంపత్ తండ్రి దశరథరామయ్యకు యాభై ఎకరాల సుక్షేత్రమయిన మాగాణేకాక మామిడి, కొబ్బరి, అరటి తోటలు ఆ గ్రామంలో ఉన్నాయి. చుట్టూ చెట్ల నడుమ తోటలకు ఆనుకొని అన్ని సౌకర్యాలతో కూడిన పెద్ద మండువాలోగిలి ఇల్లు. పదిమంది పాలేర్లు. ఒక ట్రాక్టరు. వ్యవసాయానికి కావాల్సిన ఆధునిక పరికరాలు. ఎక్కడికి వెళ్ళాలన్నా ఒక జీపు.

ఆయన దృఢంగా వుంటాడు. కంటిచూపుతోనే ఆజ్ఞలు జారీచేస్తూ పనులు నెరవేర్చుకో గల దిట్ట. ఆ ఊరికి రాజు ఆయనే. ఆ గ్రామస్థులందరికీ ఆయన దేవుడు. ఆయన మాట వేదవాక్కు.

ఆయనకు సంపత్ ఒక్కడే కొడుకు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో చదివించి, పొలాలన్నీ కొడుకు చేతిలో పెట్టి అతడినీ తనంతటివాడిని చేయాలనేది ఆయన కోరిక. అందుకు కొడుకు సుముఖత చూపలేదు. తన స్నేహితులంతా ఎమ్‌బీబీయస్ చదివి డాక్టర్లవు తున్నారు... నాలుగు తరాలబట్టీ ఈ ఊరినే పట్టుకువేలాడుతూ ఎకరాలు ఎకరాలు పెంచు కుంటున్నారేగానీ మారుతున్నలోకం గురించి ఏమైనా తెలుసుకుంటున్నారా- నాకీ వ్యవసాయపు చదువులొద్దు- అంటూ వాళ్ళమాట వినకుండా ఎంట్రెన్స్ రాసి, నెగ్గి కోరు కున్నట్లుగా గుంటూరు మెడికల్ కాలేజీలో సీటు సంపాదించుకున్నాడు.

తెలివిగలవాడే కాదు, తండ్రిలాగా పట్టుదలమనిషి కూడా. అంతేకాకుండా అదే కాలేజీలో తనకు జూనియర్ అయిన సులోచనతో పరిచయం పెంచుకొని, పెద్దలను ఒప్పించి పెళ్ళికూడా చేసుకున్నాడు. ఒకే కులం, సమాన అంతస్తు అవ్వటంతో తల్లిదండ్రులకూ అభ్యంతరంచెప్పే అవకాశం లేకపోయింది. అతడు ఎమ్బీబీఎస్ పూర్తిచేసి ఎమ్డీ చేసే సమయానికి సులోచన ఎమ్బీబీయస్ పూర్తిచేసింది.

సులోచన తండ్రి హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ బిజినెస్‌లో కోట్లు సంపాదించాడు. కూతురుకు గుంటూరులో సీటు రావటంతో తన చెల్లెలు దగ్గరవుంచి చదివించాడు. ఆయన ప్రోద్బలంతోటే హైదరాబాద్‌లో అన్ని వసతులతో కూడిన పెద్ద నర్సింగ్‌హోం ప్రారంభించి, రెండుచేతులా సంపాదిస్తున్నారు దంపతులు.

సంపత్ తండ్రికి అలా కొడుకు తమకు దూరంగా హైదరాబాద్‌లో వుండటం ఇష్టం

లేకపోయినా– అతడి పట్టుదల తెలిసిందేగనుక అంగీకరించక తప్పలేదు. తల్లిదండ్రుల్నికూడా హైదరాబాద్ వచ్చేయమన్నాడు సంపత్. అందుకు ఆయన అంగీకరించలేదు. గ్రామంలో ఆస్తిని, రాజాలాంటి బ్రతుకుని వదులుకొని పట్నంపోయి పదిమంది నడుమ ఓ అనామకుడిలా బ్రతకటం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేకపోయింది.

"మేం ఉన్నంతకాలం ఇక్కడ పొలాలు, తోటలు మా చేతులు దాటటానికి వీల్లేదు... అవే మాకు ప్రాణం... తరువాత అంటావా మీ ఇష్టం!" అంటూ ఖచ్చితంగా చెప్పేశాడు. "మేం ఈ ఊరు వదిలి ఎక్కడికీ వచ్చేప్రసక్తే లేదు... ఎన్నడూ ఆమాట నాముందు ఎత్తవద్దు!"

తండ్రికి తల్లిద్వారా చెప్పించాలని చూచాడుకాని– తల్లి భర్త గీచిన గీటు దాటదని తెలిసిందే. అందుకనే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

"ఏమంటారు మీరు ఇంతకీ?" అడిగింది సులోచన తన ప్రయాణ విషయం.

"ఏమంటాను... రాణీగారు చెప్పింది వినకపోతే మా బ్రతుకు బోడిబ్రతుకేగదా... లైటార్పు ముందు... పన్నెండవ్వబోతోంది!"

"ఓకే... అలాగే... లైటార్పుతానుగాని ఇటుతిరిగి చెప్పండి... నేను తెలివిగలదాన్నని ఒప్పుకుంటారా?" అన్నది కొంటెగా. "మీరు ఎమ్‌సెట్‌లో ర్యాంకు కొట్టేసి మీకు దగ్గరలో వున్న కాలేజీలో సీటు సంపాదించుకున్నారు... కానీ నాకు అంతమంచి ర్యాంకు రాక పోవటంతో హైదరాబాద్‌కు అంతదూరంలో వచ్చిపడ్డాను... ఎందుకో తెలుసా?"

"మేనత్త దగ్గర ముద్దులుకుడుద్దామని!" చేయిపట్టుకొని మీదకు లాక్కున్నాడు. "ఆమెగారికో కొడుకు లేకపోవటం నా అదృష్టం!"

"కాదు... ఎంట్రన్స్ రాసేటప్పుడే నాకో కల వచ్చింది– నా హీరో గుంటూరులో మెడిసిన్ చేస్తున్నాడని... నేను అక్కడ జేరకపోతే ఏ కిలాడీనో వలలో వేసుకొని స్వంతం చేసుకుంటుందని...!"

"ఎలా... ఎలా?" సంపత్ లేచి కూర్చున్నాడు. "అంటే మన పెళ్ళి వెనుక పెద్ద చరిత్రే వున్నదన్నమాట... చెప్పు... చెప్పు!" అన్నాడు ముందుకు వంగుతూ.

"ఇలా!" అతడిని ఆనుకుంటూ బుగ్గలు సాగదీసింది.

"ఎన్నింటికి వచ్చింది మేడమ్, ఆ కల?"

"ఎప్పుడొచ్చినా కల కలే!"

"మా బామ్మ ఎప్పుడూ చెబుతుండేది... తెల్లవారుజామున వచ్చిన కలలే నిజమవు

తయ్యని!" అన్నాడు అతడు ఆమె చెంపమీద చేయివేసి గిలిగింతలు పెడుతున్నట్లుగా నొక్కుతూ.

"అవునండీ సారు! అయిదున్నరకు వచ్చింది... చలికాలమవ్వటంతో మంచి రగ్గు కప్పుకొని ముడుచుకు పడుకున్నానేమో... ఆ కలరావటంతోనే ఉలిక్కిపడి లేచాను... న్యూస్‌పేపరు తలుపుమీద విసిరికొట్టిన శబ్దానికి పరుగెత్తుకుంటూ వెళ్ళి తలుపు తీసాను ఆ రోజు ఎమ్‌సెట్ రిజల్ట్స్ వస్తాయ్యని గుర్తుకు రావటంతో... చూద్దును గదా ఓ బోడి ర్యాంకు!" అన్నది పకపకా నవ్వుతూ సులోచన. "ఈ గాలికబుర్లు వదిలేయండిగాని... నేను చెప్పిన ప్రోగ్రాం సంగతేమిటి... పొద్దున్నే టిక్కెట్టు తెప్పించమంటారా?"

"అంతముందుగా వెళ్ళటం అవసరమా అని ఆలోచిస్తున్నాను!" అన్నాడు కళ్ళుమూసి తెరుస్తూ సంపత్.

"మా అత్తగారింటికి వెళ్లి అక్కడ మామగారి షష్టిపూర్తి కార్యక్రమానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లూ నేనే స్వయంగా, ఘనంగా చేయాలని కోరుకుంటున్నాను... మీకు ఏ మాత్రం తల్లిదండ్రులమీద ప్రేమ, మమకారం, ఇష్టం, గౌరవం ఉన్నా నామాట కాదనరు!" అన్నది భర్తను తనమాట కాదనటానికి వీల్లేకుండా కవ్వింపులతో బంధిస్తూ.

"నాకు వాళ్ళమీద ప్రేమ లేకగాదు, గౌరవం లేక గాదు... నువ్వు చేయాలనుకుంటున్న ఆ ఘనమైన ఏర్పాట్లు చేసేందుకు ఆయనకు చాలామంది సేవకులు ఉన్నారు... హేమాహేమీల్లాంటి సలహాదారులున్నారు... ఇంతదూరం నుంచల్లా కోడలుపిల్ల పనులన్నీ వదిలేసివెళ్ళి చేయాల్సిందేమీ ఉండదు అక్కడ!"

"సేవకులు సేవకులే... కోడలుపిల్ల కోడలుపిల్లే... అంతేకాదు కన్నకొడుక్కు ప్రతినిధిగా వెళ్ళి ఆ పనులు చేయటంలోని హుందాతనం పనివాళ్ళు చేస్తే రాదు!... పోనీయ్ మీరు ముందుగా వెళ్ళండి... మన ఆసుపత్రిలో నా తిప్పలేవో నేను పడతాను!"

"తల్లీ నీకో నమస్కారం!... నువ్వే వెళ్ళు... నాకుమాత్రం ఆ పనికిమాలిన పనులు చెప్పబోకు... ఇకనైనా లైటార్పితే సంతోషిస్తాను!"

"థాంక్యూ... థాంక్యూ శ్రీవారూ... మీరు మాత్రం ఆ రోజు తెల్లవారేటప్పటికి అక్కడ వుండాలి!"

"నా ఏడుపేదో నేను ఏడుస్తానుగానీ ఇక పడుకో సుత్తికొట్టకుండా!"

* * *

సులోచన పొన్నూరులో రైలు దిగి మామగారు పంపిన జీపులో ఇంటికి వచ్చేటప్పటికి ఎనిమిదిగంటలయింది. క్రితం రాత్రి భార్యను రైలెక్కిస్తూనే తండ్రికి ఫోన్‌చేసి చెప్పాడు ఆ

విషయం.

"చాలా సంతోషమమ్మా! నువ్వు రావటం నాకు నా కొడుకు రావటం కంటేకూడా ఆనందం కలిగిస్తోంది!... శకుంతలా నీ కోడలు వచ్చింది!" అంటూ దశరథరామయ్య భార్యను పిలిచాడు. ఆయన మాట వింటూనే లోపలనుంచి ప్రవీణ్ వచ్చాడు. "నీకు శ్రమ తగ్గించాలనే... పదిరోజులు ముందే వచ్చి నేనిక్కడ తిష్ఠవేసుకు కూర్చొని ఒంటిచేత్తో పనులన్నీ అజమాయిషీ చేస్తున్నది... నాకు తెలుసు మా తమ్ముడు ఆ ఆసుపత్రి వదిలిరాలేడని, రాడని... మా అదృష్టం నిన్నయినా పంపించాడు... మనిద్దరం కలిసి మా బాబాయి షష్టిపూర్తి మహోత్సవం ఈ జిల్లాలోనే కాదు, ఈ దేశంలోనే ఇంతగొప్పగా మరొకటి జరగలేదన్నట్లుగా ఘనంగా చేయాలి!"

ప్రవీణ్ సంపత్ పెదనాన్న కొడుకు. గుంటూరులోనే ఓ పొగాకు కంపెనీలో సీజనల్ గుమాస్తాగా పనిచేస్తుంటాడు. సంవత్సరానికి ఆరునెలలే ఉద్యోగం. మిగతా ఆరునెలలు బలాదూరు తిరుగుడు. భార్యా, ఇద్దరు పిల్లలు... బాబాయికి, పిన్నికి మాటలు చెబుతూ వచ్చినప్పుడల్లా నాలుగు డబ్బులు గుంజుకు వెళుతుంటాడు.

మరో నాలుగడుగులు వేసిందో లేదో– "ఏమే కోడలు పిల్లా! మొగుణ్ణి చంకనేసుకు రాకుండా ఒక్కదానివే వచ్చావ్" లోపల కాలుపెడుతున్నదల్లా ఆ కంఠం వింటూనే ఉలిక్కిపడి తలెత్తింది సులోచన.

ఓ ముసలామె ఎర్రంచు తెల్లచీర కట్టుకొని వున్నది. పొడుగ్గా సన్నగా వున్నది. బుగ్గలు సొట్టలుపడి పళ్లు ఊడినయ్యా అన్నట్లుగా వున్నది. తెల్లజుట్టును వేలుముడి వేసుకున్నది.

"అట్లా చూస్తావేమిటీ... నీ పెళ్ళిలో నన్ను చూడలా... దశరథరాముడి వేలువిడిచిన మేనమామ కూతుర్ని... ఇక్కడ దగ్గరలో బాపట్లలోనే ఉంటానులే... ఆయనగారు నాకంటే పదేళ్ళు చిన్నయ్యాడుకాని, ఒక్కరోజు పెద్దయినా నా మొగుడిగా చేసుకుండేదాన్ని... ఈ నాలుగురోజులూ వంటిల్లు నా చేతిలోనే వుంటుంది... ఏం కావాలన్నా మొహమాటపడకుండా అడిగి చేయించుకుని తిను... అవునూ– నాకు తెలియక అడుగుతాను... నాలుగేళ్ళయింది గదా పెళ్ళయి, మొగుణ్ణి చెంగుకు కట్టుకున్నావా లేదా... మా ఆయనయితే బ్రతికున్నంత కాలం నాకు చెప్పకుండా ముక్కు చీదేవాడు కాదు!"

"అక్కయ్యా! ఆ వంట వాళ్ళు ఎందుకో పిలుస్తున్నారు ఏం కావాలో కనుక్కో!" అన్నది కోడలితో ఆమె మాట్లాడుతున్న తీరుకు కాస్తంత చికాగ్గా శకుంతల.

"వెళ్తున్నాలే... నేను అక్కడలేందే ఒక్కపనీ కాదు... మా బావేమో మహా అనుభవజ్ఞులు

అంటూ వాళ్ళను తెచ్చిపెట్టాడు గుంటూరునుంచల్లా!" అంటూనే దొడ్డివైపుకు పరుగెత్తింది.

ఆమె అటు వెళ్ళగానే శకుంతల, "రమణక్కయ్య పెద్దదిగాని ఏదో చాదస్తంగా ఇట్లాగే మాట్లాడుతుంటుంది... పట్టించుకోబోకు... రాత్రంతా ప్రయాణంచేసి వచ్చావ్, స్నానంచేస్తే, టిఫెన్ తిని పడుకుందువుగాని ఓగంటసేపు... ఇదుగో మీగది తాళంచెవి... రాత్రి అబ్బాయినుంచి ఫోన్ రాగానే శుభ్రం చేయించి అట్టిపెట్టాను!" అంటూ తాళంచెవి ఇచ్చింది.

వాళ్ళకోసం ప్రత్యేకంగా అన్ని హంగులతోనూ వున్న అ గది కొడుకూ, కోడలూ వస్తేనే తెరుస్తారు. తన గదివైపుకు వెళుతున్న సులోచన వెనుకే నాలుగడుగులు వేసి చిన్నగా, "నువ్వు గదిలో లేకపోతే మాత్రం తాళం వేస్తుండు... ఈ నాలుగు రోజులూ ఎవరెవరో వస్తుంటారు, పోతుంటారు!" అన్నది గుసగుసగా ఆమె కోడలితో.

నిజమే... వేడుకల హడావుడిలో రకరకాల మనుష్యులు వస్తుంటారు... మన జాగ్రత్తలో మనం ఉండకపోతే నష్టపోయేది మనమే!

తన గదిలోకి వెళుతూనే, భర్తకు ఫోను చేసింది సులోచన కులాసాగా జేరానంటూ. "ఇప్పటికే మీ ప్రవీణన్నయ్య వచ్చి ఇక్కడ ఏర్పాట్లన్నీ చేస్తున్నాడు... మీరు రాకపోయినా మీరన్నట్లుగా ఇక్కడ ఏపనులూ ఆగవు!" అన్నది పెద్దగా నవ్వుతూ..

"వచ్చాడూ! నిజమే... వాడు వందమంది మనుష్యుల పెట్టేగాని... నువ్వు కాస్త జాగ్రత్తగా వుండు!"

భర్తమాటలు వింతగా తోచినా, "సరే!" అన్నది అతడి గురించి తరువాత తెలుసుకుందాంలే అన్నట్లుగా.

## 2

**సు**లోచన హాల్లో డైనింగ్ టేబుల్ దగ్గర టిఫెన్ తింటున్నప్పుడు అత్తగారు శకుంతల, "అబ్బాయి కూడా వస్తే బాగుండేది... బంధువులంతా వస్తున్నారు... ఎప్పుడో ఇలాంటి సమయాలల్లోనే కదా అందరూ కలిసేది!" అన్నది దిగులుగా. "ఇదుగో నీ పెళ్ళయింతరువాత ఇంత పెద్ద ఎత్తున జరుపుతున్నది ఇదే!"

"వాడు రాడే... ఆ రోజు ఏదో చుట్టపుచూపుగా వచ్చి, ముఖం చూపించి- నేనూ వచ్చాను అంటూ, అదేదో ఘనకార్యంలా అందరివంకా ఒక చూపు విసిరి, మళ్ళా రాత్రికే రయ్‌మంటూ కారెక్కేస్తాడు!" ఆయన ఎప్పుడొచ్చాడో వాళ్ళు గుర్తించనేలేదు. ఆ మాటలు వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తారు ఇద్దరూ.

అప్పటికే ఆయన హాలు మధ్యలో వున్న సోఫాలో కూర్చొనివున్నాడు. "నాకిష్టం

లేకపోయినా మెడిసిన్‌లో జేరాడు... సరేలే అనుకున్నాను... మనకు ఇంకా సంపాదించాల్సిన అవసరంలేదు, ఇంటిపట్టునే వుండి మన ఊరి ప్రజలకే సేవచేయరా అన్నాను... కాదు, నాకు సంపాదనే ముఖ్యం అన్నట్లుగా ఆ మహానగరానికి వెళ్ళాడు... కానీయ్ అనుకున్నాను!" నిర్లిప్తంగా అన్నాడు. "సరేలే... ఆ సోదంతా ఇప్పుడెందుకు గాని... నువ్వు వచ్చావ్ నాకు అదే సంతోషం తల్లీ... నువ్వే నాకు కోడలువయినా, కూతురువయినా!"

"అదేంలేదు మామయ్యగారూ! ఆయన అక్కడున్నా మనస్సంతా మీ దగ్గరే!" అన్నది అనునయిస్తున్నట్లుగా.

"అలా అనుకుంటూ తృప్తిపడక చేసేదేమున్నది!" అన్నాడు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ఆయన.

రుక్మిణమ్మ హడావుడిగా లోపలకు వచ్చింది. "అడగటమే మర్చిపోయాను కోడలు పిల్లా! మా బావను తాతగా ఎప్పుడు చేస్తున్నావ్... పెళ్ళయి నాలుగేళ్ళయింది... ఆయనగారి షష్టిపూర్తికయినా ఒళ్ళో మనవడుంటాడని ఆశపడ్డాను!" అన్నది అసలే లోపలకు పోయిన బుగ్గల్ని మరింత లోపలకు నెట్టుకుంటూ.

ఇబ్బందిగా మొహం పెడుతూ తలవంచుకున్నది సులోచన. సంపత్‌కూ, తనకూ ఓ అవగాహన వున్నది... ఇంకా రెండేళ్ళు, ఆ నర్సింగ్ హోం ఓ స్థాయిలోకి ఎదిగిందాకా తను ఆ రొంపిలోకి దిగగూడదని!

శకుంతల విసుగ్గా చూచింది ఆమె వంక. "సరేలే! ఉన్నవాళ్ళు మనల్ని ఆకాశానికి ఎత్తుతున్నారు... ఇక ఆ వచ్చేవాళ్ళు ఎత్తుతారు... ఇంతకీ అరిసెల సంగతి ఏంచేశావ్... పొన్నూరు మనిషిని పంపించి ఈ పూటన్నా ఇంకో రెండు జతల గరిటెలు తెప్పిస్తున్నావా?... ఆలస్యమయితే చివరకు అంతా హడావుడి అయిపోతుంది!" అన్నది ఆమెను అక్కడనుంచి పంపించాలనే ఉద్దేశ్యంతో.

"మనిషిని పంపించటమెక్కడ... వాళ్ళమొహం వాళ్ళకేం తెలుస్తుంది ఎలాంటి గరిటలుకావాలో... ప్రవీణ్‌ను తీసుకొని నేనే జీపులో వెళ్ళి కొనుక్కువస్తాలే... నాలుగు జతలుంటేగాని అన్ని అరిసెలు ఒక్కరోజులో చేయలేరు!... రెండువేలమంది భోజనాలకు వస్తారని చెప్పినా రెండు గరిటలతో వచ్చారు గుంటూరునుంచల్లా ఊగుకుంటూ!" అంటూ మళ్ళా వంటవాళ్ళ దగ్గరకు వెళ్ళిపోయింది ఆవిడ.

ఆమె అసలు బాధ, బాపట్లనుంచి తనకు తెలిసిన వంటవాళ్ళను తీసుకు వద్దామనుకున్నది కాని, ఈలోగానే దశరథరామయ్య గుంటూరువాళ్ళకు బయానా ఇచ్చేశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Amani+Pilichindi**

* * *